సాక్షి

పార్వతీపురం మన్యం

ఆదివారం । 15 । జూన్ । 2025



క్రీడా పాఠశాల పిలుస్తోంది..

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఆసక్తి. అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. -IIలో



వరాలేమయ్యాయి..!

టీడీపీ కూటమికి బీసీ డిక్లరేషన్‌లో విశ్వబ్రాహ్మణులకు ప్రకటించిన వరాల ఊసేలేదని విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు విమర్శించారు. -IIలో



తప్పించుకుపోయారు..

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు స్కూటీతో పోలీసులను పరుగులెత్తించారు. గంజాయితో పాటు వాహనాన్ని వదిలేసి పోలీసులకు దొరకకుండా తప్పించుకున్నారు. -IIలో

న్యూస్‌రీల్

నేటి నుంచి డీఏజీయుపై అవగాహన

● కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



పార్వతీపురంటౌన్: జిల్లాలో ఆదివారం నుంచి దర్తీ అబాజన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డీఏజీయు)పై అవగాహన కల్పిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లా అధికారులతో శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 15 నుంచి 30 వరకు డీఏ జు అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఆధార్, రేషన్, ఆయుష్మాన్ భారత్ కార్డులు, కులధ్రువీకరణ, నివాస ధ్రువీకరణ పత్రం, కిసాన్ క్రెడిట్ కార్డ్, పీయం కిసాన్ కార్డులు, జన్‌ధన్ ఖాతా, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమా కవరేజ్, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ సామాజిక భద్రత పింఛన్లు, ఉపాధి హామీ, పీఎం విశ్వకర్మ, ముద్ర తదితర జీవనోపాధి పథకాలు, పీఎంఎంవీవై, ఇమ్యునైజేషన్ తదితర స్త్రీ శిశు సంక్షేమ ప్రయోజనాలు అందిస్తామన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

ఏనుగులు సంచరిస్తున్నాయి.. జాగ్రత్త



కోటసీతారాంపురం చెరువు వద్ద సంచరిస్తున్న ఏనుగుల గుంపు

సీతానగరం: మండలంలోని ఏగోటివలస పొలాల నుంచి శనివారం కోటసీతారాంపురం మార్గంలోకి ఏనుగుల గుంపు చేరుకుందని, రాత్రిపూట ప్రయాణించేవారు అప్రమత్తంగా వ్యవహరించాలని అటవీశాఖ అధికారులు కోరారు. కోటసీతారాంపురం, పునుబుచ్చింపేట, రంగంపేట, ఏగోటివలస గ్రామాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. రాత్రిపూట ఇళ్ల నుంచి బయటకు వెళ్లరాదన్నారు.

కాలువ ఇలా.. సాగునీరెళ్లేదెలా?



చిత్రంలో పూడికలతో రూపుకోల్పోయిన పిల్ల కాలువ జియ్యమ్మవలస మండలం కుదమ గ్రామ సమీపంలోనిది. వట్టిగెడ్డ ప్రాజెక్టు పరిధిలోని కాలువలన్నింటిదీ ఇదే పరిస్థితి. ఖరీఫ్ ఆసన్నమవుతున్నా కాలువలను అభివృద్ధి చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీటి కష్టాలు తప్పేలా లేవని బెంగపడుతున్నారు. వాస్తవంగా వట్టిగెడ్డ పరిధిలో సాగునీటి వనరుల అభివృద్ధికి నీటి సంఘాల ద్వారా 14 పనులకు 39.5 లక్షలు మంజూరయ్యాయి. అలాగే, ఎఫ్‌డీఎంఎస్ కింద మూడు పనులకు రూ.12 లక్షలు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్ కింద 30 లింక్ చెరువుల అభివృద్ధి పనులకు రూ.మూడు కోట్లు, చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయి. కూటమి నేతల మధ్య పనుల పంపకాల్లో తేడా రైతులకు శాపంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– జియ్యమ్మవలస రూరల్

అందరికీ ఎగనామం

కొందరికే వందనం!

● పథకం అమలులో మోసం
● ఇస్తున్నది రూ.13 వేలే..
● రాజకీయాలతో అర్హులను పక్కన పెట్టేసిన వైనం





ఈ చిత్రంలోని మహిళ పేరు హిమరిక జానకి. రావికోన బట్టివలస గ్రామం. ఈమెకు చదువుతున్న ఐదుగురు పిల్లలు ఉన్నారు. ఇందులో ఎవరికీ తల్లికి వందనం డబ్బులు పడలేదు. కారణం.. పెదబొండపల్లి గ్రామ సమీపంలో ఆమెకు 70 ఎకరాల భూమి ఉన్నట్లు చూపడం. జీవించడానికే కష్టంగా ఉన్న తమకు 70 ఎకరాల భూమి ఏమిటనీ జానకి ప్రశ్నిస్తోంది. తమ గ్రామంలో చాలామందికి డబ్బులొచ్చాయని.. తనకు మాత్రం రాలేదని వాపోతోంది. ఇదే విషయమై అక్కడి వీఆర్వోకు అడిగితే.. ఆన్‌లైన్‌లో తొలగించడానికి చాలా పెద్ద తతంగం ఉంటుందని, ఇప్పట్లో అవ్వదని తేల్చిచెప్పారంటూ ఆవేదన వ్యక్తం చేస్తోంది.

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం రూరల్:

అందరికీ తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. ఆచరణలో మోసగించింది. నిబంధనల కొర్రీ పెట్టి.. కొందరికే పరిమితం చేసింది. అర్హుల ఎంపికలోనూ 'రాజకీయం' చేసింది. గత ప్రభుత్వం కులం, మతం, పార్టీలేవీ చూడకుండా 'అమ్మ ఒడి' అమలు చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం పార్టీలు, ప్రజాసంఘాలు పేరు చెప్పి... చాలా మందిని లబ్ధికి దూరం పెట్టింది. రూ.15 వేలు అని చెప్పి... రూ.13 వేలే అందిస్తోంది.

పార్వతీపురం పట్టణంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల నిరసన ఇదీ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వీరందరికీ అమ్మ ఒడి పథకం లబ్ధి అందేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం నిధులు వీరెవరికీ జమ కాలేదు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి, ఆంక్షలు సడలించి తమకు తల్లికి వందనం పథకం వర్తింపజేసేలా చూడాలని అధికారులకు కోరారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు)

వీరందరూ అనర్హులు

- ఒక ఇంట్లో ఒకరు ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుతున్నట్లయితే, అదే ఇంట్లో ఇతరులకు తల్లికి వందనం వర్తించదు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఉపకార వేతనాలు పొందే వారికీ పథకం రద్దు.
- కుటుంబానికి బియ్యం కార్డు లేకుంటే పథకం రాదు.
- కుటుంబ నెలవారీ ఆదాయం గ్రామీణులకు రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించితే పథకం ఇవ్వరు.
- మాగాణి 3 ఎకరాలు, మెట్ట అయితే 10 ఎకరాలు మించి ఉండరాదు.
- పట్టణాల్లో 1000 చ.అడుగుల స్థలం ఉన్నా, నాలుగు చక్రాల సొంత వాహనం ఉన్నా పథకం వర్తించదు.
- ప్రతి కుటుంబానికి ఏడాది విద్యుత్ వినియోగాన్ని పరిగణనలోకి తీసుకుని నెలకు 300 యూనిట్లు మించి విద్యుత్ వినియోగించి ఉంటే పథకం రాదు.
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్ పొందుతున్న వారు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు వేతనం పొందుతున్న వారికి పథకం రాదు.
- కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల పరిధిలోకి వచ్చే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఆ పథకాల కింద ఆయా శాఖలు అందిస్తున్న మొత్తం మినహాయించి, మిగిలిన నగదును మాత్రమే 'తల్లికి వందనం' పథకం కింద చెల్లిస్తారు.
- సచివాలయాల్లో ప్రదర్శించిన లబ్ధిదారుల జాబితాలో ఎవరిపై అయినా ఫిర్యాదులొస్తే పథకాన్ని ఆపేస్తారు.

పార్వతీపురం మండలంలోని నర్సిపురం గ్రామంలో ఇద్దరు పిల్లలున్న ఓ కుటుంబానికి 'తల్లికి వందనం' డబ్బులు పడలేదు. సచివాలయానికి వెళ్లి అడగగా.. ఆన్‌లైన్‌లో వారి పేరిట పదెకరాలు భూమి ఉన్నట్లు చూపిస్తోందని సిబ్బంది చెప్పారు. అంత భూమి లేదని వారు చెప్పినా.. తామేమీ చేయలేమని సిబ్బంది చేతులెత్తేశారు.

భారీగా కోత..

గత ప్రభుత్వ హయాంలో ఇంట్లో ఒక్క బిడ్డకు పథకం అందేది. ఆ లెక్కనే సగటున ఏటా సుమారు 85 వేల మంది లబ్ధి పొందేవారు. వీరికి దాదాపు రూ.129 కోట్లను అప్పటి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చెల్లించేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇంట్లో చదువుకున్న పిల్లలందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని ప్రకటించింది. ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే అందరికీ పథకం వర్తించాలి. గత విద్యా సంవత్సరంలో ఒక్కరికీ ఇవ్వకపోగా.. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కేవలం 69,600 మంది తల్లులను గుర్తించి.. మొత్తం 1,08,951 మంది విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. ఒకరికి మించి పిల్లలున్న తల్లులు 39 వేల మంది ఉన్నట్లు చెబుతున్నారు. ఈ ప్రకారం చూసుకుంటే గత ప్రభుత్వం ఒకరి లెక్కన ఇచ్చిన దాని కంటే ఇప్పుడున్న సంఖ్య 20 వేలకు పైగా తగ్గింది. అందరికీ ఇస్తామని చెప్పి.. నిబంధనల కొర్రితో లబ్ధిదారుల్లో భారీగా కోత విధించారు.

- సర్పంచ్‌ల పిల్లలకు తల్లికి వందనం పథకానికి అర్హత లేదని కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపింది. వారు ప్రతి నెలా రూ.3 వేలు గౌరవ వేతనం తీసుకుంటున్నందున.. వారిని ఉద్యోగుల కేటగిరీ కింద లెక్కేసి.. పిల్లలను అనర్హుల జాబితాలో చేర్చింది. దీంతో, వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పార్వతీపురం మండలం డోకిశీల పంచాయతీ తేలినాయుడువలస గ్రామానికి చెందిన పాలమెట్ట చిన్నమ్మి కుమార్తె పదో తరగతి చదువుతోంది. తల్లికి వందనం డబ్బులు పడలేదు. అధికారులకు అడిగితే.. 'మీరు ప్రజాసంఘాల్లో ఉన్నారు. మీకు పడతాయో లేదో తెలియదు' అని సమాధానమిచ్చారు. ఇదే గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి పాలమెట్ట అభిషేక్‌కు కూడా డబ్బులు జమ కాలేదు. అడిగితే.. విద్యార్థి కుటుంబం వేరే పార్టీలో ఉండటం వల్ల డబ్బులు పడతాయన్న గ్యారంటీ లేదని సమాధానం ఇచ్చినట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు.



పాలమెట్ట అభిషేక్

కొందరికే కాదు.. అందరికీ ఇవ్వాలి...

తల్లికి వందనం పథకం కొందరికే కాదు.. అందరికీ ఇవ్వాలి. నిబంధనల పేరుతో అధిక మంది విద్యార్థులను అనర్హులుగా ప్రకటించడం అన్యాయం. అధికారంలోకి వస్తే ఎటువంటి షరతులూ లేకుండా విద్యార్థులందరికీ రూ.15 వేలు ఇస్తామని మాట ఇచ్చి.. ఇప్పుడు కోత పెట్టి రూ.13 వేలు ఇవ్వడం విచారకరం. 300 యూనిట్లు విద్యుత్ వినియోగించిన వారికి, అతి తక్కువ జీతంతో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ కుటుంబంలో ఉన్న పిల్లలకు పథకాన్ని నిలిపివేయడం సరికాదు.

– బి.రవికుమార్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

నెరవేరని సంధ్యారాణి హామీ..

చందాలతో బడి నిర్మాణం



మెట్టవలసలో గిరిజనులు చందాలతో నిర్మిస్తున్న పాఠశాల భవనం

సాలూరు/సాలూరు రూరల్:

'సాలూరు మండలం తోణాం పంచాయతీ మెట్టవలస గ్రామానికి పది రోజుల్లో పాఠశాలకు భవనం మంజూరు చేయించి నిర్మిస్తాం. పక్కాగా వసతి కల్పిస్తాం.'

– స్త్రీశిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి హామీ

మెట్టవలసలో ఓ శుభకార్యానికి వచ్చిన మంత్రి సంధ్యారాణి పాఠశాల భవనం మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చి నెలలు గడిచాయి. భవనం మాత్రం మంజూరు కాలేదు. గత ప్రభుత్వం నాడు–నేడు రెండోదశలో భవన నిర్మాణానికి 2024 సంవత్సరం జనవరిలో రూ.16 లక్షలు మంజూరు చేసినా ఎన్నికల కోడ్‌తో పనులు ప్రారంభం కాలేదు. కనీసం ఆ విషయాన్ని ప్రస్తావించి అయినా భవనం మంజూరు చేయించలేకపోయారు. మంత్రి హామీ నెరవేరదని తెలుసుకున్న గిరిజనులు చందాలతో పాఠశాల విద్యార్థులకు వసతి కల్పనకు పూనుకున్నారు. ఇంటికి రూ.500 చొప్పున, గ్రామ పెద్దలు కాస్త ఎక్కువ మొత్తంలో పోగుచేసి నెల రోజులుగా షెడ్‌ల నిర్మాణ పనులు తలపెట్టారు. విద్యా సంవత్సరం ఆరంభం కావడం, మెట్టవలస ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న సుమారు 70 మంది పిల్లలకు వసతి లేకపోవడంతో తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. చెట్ల కింద వేసిన తాత్కాలిక పందిరిలోనే చదువులు సాగిస్తుండడంతో పాఠశాల భవన నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన తలపెట్టినట్టు తెలిపారు. మంత్రి మాటలు నమ్మి మోసపోయామని వాపోయారు.

చందాలతో నిర్మిస్తున్నాం..



గిరిజన సంక్షేమ శాఖ మంత్రి 10 రోజుల్లో పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. నెలలు గడిచినా పాఠశాల సమస్యపై కన్నెత్తి చూడలేదు. గ్రామ పెద్దలందరం కలిసి చందాలు ఎత్తుకొని పాఠశాల భవన నిర్మాణానికి పూనుకున్నాం. పాఠశాల ప్రారంభ సమయానికి తరగతి గదులు సిద్ధం చేయాలన్న సంకల్పంతో పనులు చేపట్టాం. వర్షాల వల్ల కాస్త జాప్యం జరిగింది. ఒకటి రెండు రోజుల్లో పూర్తవుతాయి. విద్యార్థులకు వసతి కష్టాలు గట్టెక్కుతాయి.

– మువ్వల ఆదయ్య, సర్పంచ్, తోణాం పంచాయతీ

తాగునీటి సమస్య పరిష్కరించండి

● పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో ధర్నా



తాగునీటి సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న పట్టణ ప్రజలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య వెంటాడుతోంది... నాలుగు రోజులకు ఓ సారి తాగునీరు సరఫరా చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నాం.. తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని పలు వార్డుల ప్రజలు మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. కొన్నిసార్లు బురదనీరే సరఫరా అవుతోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్లు వారం రోజులుగా సమ్మెలో ఉండడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, ట్యాంకులతో కూడా సరఫరా చేయడంలేదంటూ గగ్గోలు పెట్టారు. మున్సిపల్ కమిషనర్‌కు గత రెండు రోజుల నుంచి విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నీట్–2025లో ర్యాంకుల పంట

విజయనగరం అర్బన్:

వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల కోసం నిర్వహించిన 'నీట్–2025' ప్రవేశ పరీక్షలో ఉమ్మడి విజయనగరం జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. ర్యాంకుల పంట పండించారు. ప్రవేశ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 1,563 మంది హాజరుకాగా వారిలో జిల్లా, ఇతర జిల్లాల్లోని వివిధ ప్రైవేటు కళాశాలల్లో చదివిన పలువురు 720 మార్కులకు 600 పైబడి తెచ్చుకొని వెయ్యిలోపు ర్యాంకులు సాధించారు.



తల్లిదండ్రులతో 116వ ర్యాంకర్ కాండ్రేగుల నిధి

- విజయనగరం పట్టణానికి చెందిన కాండ్రేగుల నిధి 642/720 మార్కులతో జాతీయ స్థాయిలో 116వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 27వ ర్యాంకు సాధించింది. తల్లిదండ్రులు ప్రవీణకుమార్, సుహాసినిలు ఇద్దరూ వైద్యవృత్తిలో ఉన్నారు. ఈ సందర్భంగా నిధి మాట్లాడుతూ ఏఐఎంఎస్‌లో చేరి పరిశోధన రంగం వైపు అధ్యయనం చేస్తానన్నారు.
-  పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం చినభోగిలి గ్రామానికి చెందిన మర్రాపు జయదీప్ 613/720 మార్కులు తెచ్చుకొని జాతీయ స్థాయిలో 672, ఓబీసీలో 183వ ర్యాంకు సాధించారు. తండ్రి కృష్ణమూర్తి అజ్జాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కాగా, తల్లి శోభారాణి సెకెండరీ గ్రేడ్ టీచర్. వైద్య రంగంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్నదే లక్ష్యమని జయదీప్ అన్నారు.
- విజయనగరం పట్టణానికి చెందిన జాగారపు సహజ 606/720 మార్కులతో జాతీయ స్థాయిలో 989, ఓబీసీ కేటగిరీలో 294 ర్యాంకు సాధించింది. తండ్రి ఈశ్వరరావు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు కాగా, తల్లి రాధ డ్వామాలో పనిచేస్తున్నారు.
-  విజయనగరం పట్టణానికి చెందిన లచ్చిపత్తుల సాయి శ్వేత 580/720 మార్కులు తెచ్చుకొని ఓబీసీ కేటగిరీలో 1,271 సాధించింది. 500 మార్కులు దాటి వచ్చిన వారిలో నారా అక్షయ (528 మార్కులు) పడాల లావణ్య శ్రీ (507 మార్కులు), ఎం.సంజన (503 మార్కులు) ఉన్నారు.



కుమార్తె సహజకు స్వీట్ తినిపిస్తున్న తండ్రి

రాజాం విద్యార్థికి 1791వ ర్యాంకు



రాజాం సిటీ: పట్టణ పరిధి మారుతీనగర్ ప్రాంతానికి చెందిన పల్లి తారాచంద్ర శనివారం విడుదలైన నీట్ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 1791వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 584వ ర్యాంకు సాధించాడు. ఆయన తండ్రి పల్లి జనార్దన రావు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్‌లో విధులు నిర్వహిస్తుండగా, తల్లి రాజకుమారి గృహిణి.

సత్తా చాటిన లోచర్ల విద్యార్థి



తల్లిదండ్రులు, తమ్ముడితో తులసీ భార్గవ్‌రామ్

తెర్లాం: నీట్ పరీక్ష ఫలితాల్లో తెర్లాం మండలం లోచర్ల గ్రామానికి చెందిన మర్రాపు తులసీ భార్గవ్ రామ్ ప్రతిభ చూపాడు. 720కి 632 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 211, ఓబీసీ కేటగిరీలో 55వ ర్యాంక్ సాధించాడు. ఏపీఈఏపీ సెట్‌లో 65వ ర్యాంకును సొంతం చేసుకున్నాడు. తండ్రి మర్రాపు త్రినాథనాయుడు తెర్లాం మండలం నెమలాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తుండగా, తల్లి గంగాభవాని గృహిణి. ప్రస్తుతం వీరు రాజాంలోని వస్త్రపురి కాలనీలో నివాసం ఉంటున్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తరువాత న్యూరాలజిస్ట్ అయి ప్రజలకు సేవ చేయాలన్నదే తన ధ్యేయమని భార్గవ్‌రామ్ తెలిపాడు.

దుఃఖాన్ని దిగమింగుకుని...



లచ్చిరెడ్డి రేష్మ

జియ్యమ్మవలస: మండల కేంద్రానికి చెందిన లచ్చిరెడ్డి రేష్మ నీట్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 3,191, ఓబీసీ కేటగిరీలో 1152 సాధించింది. తండ్రి గురుప్రసాద్ (లాయర్) పరీక్షకు నెలరోజుల ముందు మరణించారు. ఆ దుఃఖాన్ని దిగమింగుకుని పరీక్షకు సిద్ధమై విజేతగా నిలవడంపై తల్లి ఉమామహేశ్వరితో పాటు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

చెక్కులు.. ఇంకా చెల్లలే!

● 'షైనింగ్ స్టార్స్' చెక్కులు వెనక్కి..
● ఇటీవల మంత్రి లోకేశ్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ



విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి లోకేశ్ (ఫైల్ ఫొటో)

సాక్షి, పార్వతీపురం మన్యం: మన్యం జిల్లా విద్యాశాఖాధికారులు.. ఏకంగా ఆ శాఖ మంత్రి నారా లోకేశ్ పరువు తీసేశారు. స్వయంగా ఆయన చేతుల మీదుగా ఇచ్చిన చెక్కులు చెల్లని పరిస్థితి దాపురించింది. జిల్లాలో షైనింగ్ స్టార్స్ పురస్కారాల పేరిట పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ నెల 9వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేసిన విషయం విదితమే. పదో తరగతి విద్యార్థులు 95 మందికి, 26 మంది ఇంటర్ విద్యార్థులకు రూ.20 వేలు చొప్పున అందజేశారు. వీటిని తీసుకుని సంతోషంగా బ్యాంకులకు వెళ్లిన తల్లిదండ్రులకు నిరాశే ఎదురైంది. అవి చెల్లుబాటు కావని బ్యాంకు అధికారులు చెప్పడంతో మరలా వారు విద్యాశాఖాధికారులను సంప్రదించారు. ఇన్ని రోజులూ తర్జనభర్జనలు పడి, మరలా ఇప్పుడు ఆ చెక్కులను వెనక్కి తీసుకుంటున్నారు. డీడీ రూపంలోగానీ, నగదు రూపంలో గానీ ఇస్తామని అంటున్నారు. అది ఎన్ని రోజులు పడుతుందో కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. విద్యాశాఖాధికారుల నిర్వాకం చూసి తల్లిదండ్రులు కంగుతిన్నారు.

'పవర్' లేని డీఈఓతో సంతకాలు

కొద్దిరోజుల కిందట మన్యం జిల్లా విద్యాశాఖాధికారిగా అర్హత లేనటువంటి రాజ్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన విషయం విదితమే. హైస్కూల్ హెచ్‌ఎం స్థాయి అయిన ఆయనకు తొలుత డిప్యూటీ డీఈఓగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత నేరుగా డీఈఓ ఎఫ్‌ఏసీ కూడా ఇచ్చేశారు. నిబంధనల ప్రకారం ఆయనకు ఆర్థికపరమైన అధికారాలు లేనప్పటికీ.. కొంతమంది విద్యాశాఖ సిబ్బంది పక్కదారి పట్టించి, నిర్లక్ష్యంగా సంతకాలు చేయించారు. చేస్తున్నది తప్పు అని తెలిసి కూడా రెండు రకాల చెక్కులపై సంతకాలు పెట్టించారు. వాటినే మంత్రి లోకేశ్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఇలా ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ పేరిట కొన్ని, ఎంఈవో ఖాతాలతో మరికొన్ని, డీఈవో సంతకాలతో తేదీ లేకుండా ఇంకొన్ని చెక్కులు ఇచ్చారు. తల్లిదండ్రులు అవి తీసుకుని బ్యాంకుకు వెళ్తే చెల్లవని అక్కడి సిబ్బంది చెప్పేశారు. విషయం బయటకు రావడంతో కలెక్టర్ ద్వారా ఎఫ్‌ఏసీ ఆర్డర్స్ తెచ్చుకుని సంతకాలు చేస్తామని తొలుత విద్యాశాఖాధికారులు చెప్పారు.



ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ పేరిట ఇచ్చిన చెక్కు

వాస్తవానికి డీఈఓకు ఎఫ్‌ఏసీ పవర్స్ ఇవ్వడానికి కలెక్టర్ కూడా అధికారం లేదని సమాచారం. పాఠశాల విద్య కమిషనర్ ఇవ్వాలి. దీనికితోడు రాజ్‌కుమార్ డిప్యూటీ డీఈఓగానే ఇన్‌చార్జి. ఒక ఎఫ్‌ఏసీ ఉండగా.. ఇంకో ఎఫ్‌ఏసీ ఇవ్వడానికి లేదని తెలుస్తోంది. అలాంటిది డీఈఓ అర్హత లేని ఆయనకు చెక్కులపై సంతకాలు చేసే అధికారం ఉండదని సమాచారం. రెగ్యులర్ డీఈఓ వస్తేనే ఈ చెక్కులు చెల్లుతాయి. సంబంధిత ఖాతాలో కూడా నగదు లేనట్లు భోగట్టా. చెల్లని చెక్కులు తీసుకుని తామేం చేసుకుంటామని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. స్వయంగా మంత్రి ఇచ్చిన చెక్కులకే ఈ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఇంటర్ విద్యార్థులకు ఇచ్చిన చెక్కులపై ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆర్జేడీ సంతకం ఉండటంతో అవి చెల్లుబాటయ్యాయి.

క్లుప్తంగా

పిడుగు పాటుకు ఫీల్డ్ అసిస్టెంట్ దుర్మరణం

• హుస్సేనుపురంలో విషాదం



శ్రీనివాసరావు మృతదేహం

వీరఘట్టం: ఉపాధి చెరువు పనుల వద్ద మొబైల్ హాజరు వేసుకునేందుకు వెళ్లిన ఫీల్డ్ అసిస్టెంట్ పిడుగు పాటుకు గురై శనివారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని హుస్సేనుపురం గ్రామ శివారులో చెరువు పనులు జరుగుతున్నాయి. ఫీల్డ్ అసిస్టెంట్ ఖండాపు శ్రీనివాసరావు ఉదయం 9 గంటలకు పనుల వద్దకు వెళ్లి హాజరు వేసుకున్నాడు. సాయంత్రం 4 గంటలకు మళ్లీ హాజరు వేసుకునేందుకు చెరువు వద్దకు బయలుదేరాడు. అప్పటికే వర్షం పడుతుండడంతో వేతనదారులంతా వెనుదిరిగారు. గ్రామ శివారులో ఉన్న చెరువు వద్ద మొబైల్ యాప్‌లో అటెండెన్స్ వేసేందుకు శ్రీనివాసరావు మొబైల్ ఆన్ చేసే సరికి సమీపంలో పిడుగు పడడంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయాడని వేతనదారులు తెలిపారు. దూరంగా ఉన్న వేతనదారులు పరుగున వెళ్లి సపర్యలు చేశారు. వెంటనే వీరఘట్టంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శ్రీనివాసరావు చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో గ్రామంలో విషాదం అలుముకొంది. తల్లిదండ్రులు జట్లమ్మ, వెంకటనాయుడు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి



కాంతమ్మ మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన గుర్తు తెలియని మృతదేహం ఉండడాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ వై.రవికిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైన విషయం సామాజిక మాధ్యమాల్లో పొందుపరిచామన్నారు. దీంతో బొబ్బిలి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన తిమనాన కాంతమ్మ (55)గా బంధువులు గుర్తించారని తెలిపారు. మృతురాలు గత 25 సంవత్సరాలుగా మతిస్థిమితం కోల్పోయి ఎప్పటికప్పుడు ఇంట్లో నుంచి వెళ్లిపోవడం, అందే సమాచారం మేరకు మళ్లీ ఇంటికి తీసుకు వెళ్లడం జరుగుతుందని బంధువులు తెలిపారని చెప్పారు. ఈ క్రమంలోనే రాజాం మండలం బొద్దాం వైపు వచ్చి ఈ నెల 13 అర్ధరాత్రి సమయం నుంచి తెల్లవారు సమయంలో ఏదో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెంది ఉంటుందని తెలిపారు. ఈ మేరకు మృతురాలి బంధువు వజ్జి వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి..



ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి - గజపతినగరం రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలపై గుర్తు తెలియని రైలు ఢీకొనిగాని, రైలు నుంచి జారిపడిగాని గుర్తు తెలియని వ్యక్తి శనివారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో మృతి చెందినట్టు బొబ్బిలి రైల్వే హెచ్‌సీ బి.ఈశ్వర్రావు తెలిపారు. మృతుని వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉంటుందని, మృతుని శరీరంపై ఎర్ర రంగు షర్టుతో పాటు నలుపు రంగు ప్యాంటును ధరించి ఉన్నట్టు తెలిపారు. మృతుని జేబులో కేసింగ నుంచి చెన్నై సెంట్రల్‌కు వెళ్తున్నట్టు టిక్కెట్టు ఉన్నట్టు గుర్తించామని పేర్కొన్నారు. మృతదేహాన్ని విజయనగరంలోని మహరాజ కేంద్ర సర్వజన ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని కోరారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్‌డ్	స్కిన్‌లెస్
₹103	₹176	₹186

క్రీడా పాఠశాల పిలుస్తోంది..

• ఈ నెల 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం
• వచ్చే నెల 1 నుంచి 3 రోజుల పాటు జిల్లా స్థాయిలో ఎంపికలు
• జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర స్థాయి ఎంపికలకు అర్హత



వేసవి క్రీడా శిక్షణా శిబిరంలో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు(ఫైల్)

విజయనగరం: పిల్లలను కేవలం చదువుకే పరిమితం చేయకుండా వారికిష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఆటల్లో రాణిస్తే వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుంది. ఎంతోమంది తెలుగువారు క్రీడలతో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారు. చిన్నప్పటి నుంచి పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో మెరికలుగా తీర్చిదిద్దడానికి కడపలో క్రీడా పాఠశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతోమంది ఆటల్లో రాణించి, ఉన్నత స్థాయికి వెళ్లారు. ఈ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి (2025-26) 4, 5 తరగతుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్రీడా పాఠశాలలో ప్రవేశాలు పొందిన వారికి మంచి భవిష్యత్తు లభించనుంది.

19వ తేదీ వరకు గడువు

క్రీడా పాఠశాలలో నాలుగో తరగతిలో 40 సీట్లు, ఐదో తరగతిలో 40 సీట్లకు సంబంధించి ఈ ఏడాది ప్రవేశాలను చేపట్టనున్నారు. ఒక్కో తరగతిలో 20 మంది బాలురు 20 బాలికలను తీసుకుంటారు. గతంలో మూడు దశల్లో (మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి) ఎంపికలను చేపట్టేవారు. ఈ ఏడాది నుంచి రెండు దశల్లో (జిల్లా, రాష్ట్ర స్థాయి) మాత్రమే ఎంపికలు నిర్వహిస్తారు. నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం 01-04-2015 నుంచి 31-03-2017 మధ్య జన్మించిన వారు, ఐదో తరగతిలో ప్రవేశాలకు 01-04-2014 నుంచి 31-03-2016 మధ్య పుట్టిన వారు అర్హులు. ఈ నెల 19వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి సమాచారం క్రీడా శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

ఎంపికలు ఇలా..!

జిల్లా స్థాయి ఎంపికలను ఈ ఏడాది జులై 1 నుంచి 3వ తేదీ వరకు విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో చేపట్టనున్నారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, మెడిసిన్ బాల్, షటిల్‌రన్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, 600 మీటర్ల పరుగు లాంటివి నిర్వహిస్తారు. ఇందులో అభ్యర్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లా స్థాయిలో ఎంపిక చేస్తారు. అనంతరం రాష్ట్ర స్థాయి శారీరక సామర్థ్య ఎంపికలను ఈ ఏడాది జులై 10, 11 తేదీల్లో నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబరచిన వారు క్రీడా పాఠశాల ప్రవేశం పొందేందుకు అర్హులుగా నిలుస్తారు. జులై 24 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.

క్రీడాకారులకు చక్కని వేదిక



భావి భారత క్రీడాకారులుగా ఎదగాలంటే.. క్రీడా స్ఫూర్తి ఉండి భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలనుకునే వారికి క్రీడా పాఠశాల చక్కటి వేదిక. కార్పొరేట్ కంటే దీటుగా విద్యతో పాటు అనుభవజ్ఞులైన శిక్షకులతో శిక్షణ ఇస్తారు. ప్రవేశం దొరికితే మంచి భవిష్యత్తు ఉంటుంది. అన్ని సౌకర్యాలు ఉంటాయి. చదువు, క్రీడా శిక్షణ ఉచితమే. ఎంపిక పోటీలకు సంబంధించి కొన్ని మార్పులు ఉన్నాయి. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల వస్తే తెలియపరుస్తాం.

– ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి, విజయనగరం

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలి



రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

• జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

విజయనగరం: ఆత్మరక్షణ క్రీడ తైక్వాండోలో విజయనగరం జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి సత్తా చాటాలని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్.వేణుగోపాలరావు ఆకాంక్షించారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో అనంతపూర్ జిల్లా తాడిపత్రిలో జరిగిన సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో జరిగిన పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు మొత్తంగా 33 పతకాలు కైవసం చేసుకుని ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ పోటీల్లో జిల్లా క్రీడాకారులు 19 బంగారు పతకాలు, 6 వెండి పతకాలు, 8 కాంస్య పతకాలు చేజిక్కించుకుని విద్యలనగరం విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అయ్యలు, వేణుగోపాలరావులు అభినందించారు. జిల్లా క్రీడాకారులు భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన వరాలేమయ్యాయి..!



డిమాండ్లు నెరవేర్చాలని కోరుతున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

• మాట తప్పిన కూటమి ప్రభుత్వం
• ఎమ్మెల్సీ ఇస్తామన్న లోకేష్ హామీ అమలు చేయాలి
• విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు

బొబ్బిలి: గత ఎన్నికల్లో టీడీపీ కూటమి బీసీ డిక్లరేషన్ ప్రకటించి అందులో విశ్వబ్రాహ్మణులకు ప్రకటించిన వరాల ఊసేలేదని విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు అన్నారు. జిల్లా అధ్యక్షుడు ముగడ వెంకటరమణ అధ్యక్షతన పట్టణంలో సంఘ నాయకులు, సభ్యులతో శనివారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణుల సంఖ్య 25లక్షల మందికి పైగా ఉండగా కూటమి ప్రభుత్వం కేవలం 7లక్షలకు కుదించి లెక్క చూపుతోందన్నారు. కచ్చితమయిన లెక్కను చూపేందుకు తగిన కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. విశ్వబ్రాహ్మణులకు టీడీపీ ఇచ్చిన హామీలేవీ అమలుకు నోచుకోలేదని, ఇందుకోసం తాము తీవ్ర ఆవేదనలో ఉన్నామన్నారు. తమ కులానికి నష్టం కలిగించే జీఓ నంబరు 272ను సవరిస్తామన్న కూటమి ప్రభుత్వం దానిని పట్టించుకోలేదన్నారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు, స్వర్ణకారుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి అందలమెక్కిస్తామన్నారనీ, కానీ ఈ హామీపై కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ఇవే అమలు కాలేదంటే ఇక ఈ రెండింటినీ ఎంఎస్ఎంఈ పరిశ్రమల రంగానికి అనుసంధానం చేస్తామనడం మరింత మోసమయిందన్నారు. నారా లోకేష్ తమ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామన్న మాట నిలబెట్టుకోవాలన్నారు. పంచ వృత్తులు చేసుకునే విశ్వబ్రాహ్మణులందరినీ ఒకే సామాజిక వర్గంగా పరిగణించాలని, దీనిపై ప్రత్యేక జీవో జారీ చేయాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో యువ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ములగపాటి బంగార్రాజు, ఉపాధ్యక్షుడు దనాల కోట శోభన్‌బాబు, గణేష్, జి.నారాయణ, త్రినాథ హరిబాబు, కంచుమోజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ తల్లికి వందనం ఇవ్వకుంటే న్యాయ పోరాటం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్

• ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు సంబంధించి తల్లికి వందనం పథకం అర్హులైన వారందరికీ అందేలా చూడాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకం అందకపోతే న్యాయ పోరాటం చేసైనా ఈ పథకం అందే విధంగా చూస్తామని పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా అమలు చేయడం లేదని అన్నారు. విద్యాశాఖ దగ్గర ఉన్న సమాచారం మేరకు సుమారు 88లక్షల మంది విద్యార్థులు ఉండగా 55 లక్షల మంది విద్యార్థులకు మాత్రమే ఈ పథకం అందించారని వివరించారు. ప్రతి ఒక్క విద్యార్థికి రూ.15వేలు అందజేస్తామని హామీ ఇవ్వగా ఇప్పుడు వారి ఖాతాల్లో రూ.13వేలు మాత్రమే జమ అవుతుందని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం కింద రూ.15వేలు మంజూరు చేసి పాఠశాల నిర్వహణ ఖర్చుల కోసం రూ.2వేలు తగ్గించి రూ.13వేలు అందిస్తే ఇప్పటి విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ తీవ్ర విమర్శలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్నది ఏమిటని ప్రశ్నించారు. ఏ కుటుంబంలో అయినా ఒకరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తిస్తే ఆ కుటుంబంలో విద్యార్థులకు తల్లికి వందనం అమలు చేయకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇటువంటి నిబంధనలు పెట్టకుండా అందరికీ అమ్మ ఒడి అందజేశామని వివరించారు. అర్హులై ఉన్నప్పటికీ వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులకు ఈ పథకానికి ఎంపిక చేయకుండా టీడీపీ సానుభూతి పరులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని, రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గకుండా పని చేయాలని అన్నారు. లేకుంటే న్యాయ పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు టంకాల అచ్చెన్నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు వావిలపల్లి జగన్మోహనరావు, రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కరణం శ్రీనివాసరావు, డాక్టర్ బి.నరేంద్ర పాల్గొన్నారు.

గర్భిణికి స్కానింగ్ కష్టాలు



చిత్రంలో కనిపిస్తున్న గర్భిణి పేరు మాలతి. నగరంలోని అరకాల గెడ్డలో నివసిస్తోంది. నెలలు నిండడంతో అల్ట్రాసౌండ్ స్కాన్ కోసం శుక్రవారం ఘోష ఆస్పత్రికి వెళ్లారు. అక్కడి రేడియాలజిస్టు సెలవు పెట్టడంతో సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. అప్పటికే సాయంత్రం కావడంతో రశీదు పట్టుకుని శనివారం ఉదయం సర్వజన ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ స్కానింగ్ చేయమని స్పష్టం చేయడంతో.. తిరిగి ఘోష ఆస్పత్రికే వెళ్లి స్కాన్ చేయించుకుంది. నిండు గర్భిణిని అటూఇటూ తిప్పడంపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

- విజయనగరం ఫోర్ట్

పేదల ఇళ్ల స్థలాల కోసం ఆందోళన



ధర్నా చేస్తున్న నారాయణరావు, ధర్మ తదితరులు

విజయనగరం టౌన్: పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని పట్టణ బడుగు, బలహీన వర్గాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి నారాయణరావు, చెన్నా ధర్మ ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయమై స్థానిక ధర్మపురి ప్రాంతంలో శనివారం నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నాయకులు పేదలకు హామీల వర్షం కురిపించారని, అర్బన్ ఏరియాలోని పేదలకు రెండు సెంట్లు, రూరల్ ఏరియాలోని పేదలకు మూడు సెంట్లు స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి ఇళ్లు మంజూరు చేయలేదని, కొత్త వారికి ఎప్పుడిస్తారో కూడా స్పష్టత లేదన్నారు. తక్షణమే ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని లేకపోతే భవిష్యత్‌లో పోరాటం చేస్తామన్నారు. ఈ నెల 16న తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నీలాపు అప్పలరాజు రెడ్డి, గంటా సీతమ్మ, గిడిజాల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

17న అండర్ -16 క్రికెట్ జట్టు ఎంపికలు

విజయనగరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న అండర్ - 16 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం శివారు విజ్జి క్రికెట్ మైదానంలో మంగళవారం జరిగే ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2009 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. అలాగే పోటీలకు హాజరయ్యే వారు ఒరిజినల్ ఆధార్ కార్డ్, జనన ధ్రువీకరణ పత్రం, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్ తీసుకు రావాలన్నారు. ఉదయం 7.30 గంటలకు నిర్వహించే ఎంపిక పోటీలకు క్రీడాకారులు వైట్ డ్రెస్, సొంత కిట్టుతో హాజరు కావాలని ఆయన సూచించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు జిల్లా స్థాయి చెస్ క్రీడాకారుల ఎంపికలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-15 బాల, బాలికల చెస్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 15న ఆదివారం నిర్వహించనున్నట్టు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం జిల్లా కార్యదర్శి కెవి.జ్వాలాముఖి శనివారం తెలిపారు. చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనపగరం, ఫైర్ చెస్ స్కూల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎంపిక పోటీల్లో 2010 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే క్రీడాకారులు విధిగా తమ జనన ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకురావాలని సూచించారు. ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 8 మంది బాల, బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, వివరాలకు 97033 44488 నంబరును సంప్రదించాలని సూచించారు.

పోలీసులకు చెమటలు పట్టించి తప్పించుకుపోయారు..

• తప్పించుకోబోయి డీఎస్పీ వాహనాన్ని ఢీకొట్టిన బైక్
• పారిపోయిన గంజాయి తరలిస్తున్న నిందితులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనం

రామభద్రపురం: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు స్కూటీతో పోలీసులను పరుగులెత్తించారు. అయినా గంజాయి.. సంబంధిత వాహనాన్ని వారు వదిలేసి పోలీసులకు పట్టుబడకుండా తప్పించుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొట్టక్కి వద్ద ఎస్ఐ వి.ప్రసాదరావు శనివారం సాయంత్రం వాహన తనిఖీలు చేస్తున్నారు. సాలూరు నుంచి స్కూటీపై హెల్మెట్ ధరించిన ఇద్దరు వ్యక్తులు దూసుకురాగా అతివేగాన్ని కంట్రోల్ చేద్దామన్న ఉద్దేశంతో ఎస్ఐ ఆపారు. వారు ఆపకపోవడంతో ఎస్ఐ స్టేషన్ సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి అతివేగంతో వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపాలని ఆదేశించారు. ఇద్దరు కానిస్టేబుళ్లు గాంధీ బొమ్మ సెంటర్‌లోని సాలూరు నుంచి రామభద్రపురం వచ్చే టర్నింగ్ వద్ద కాపు కాశారు. ఆ సమయంలో అటుగా వస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి వాహనాన్ని కూడా తప్పించుకొని దూసుకెళ్లిపోయారు. దీంతో డీఎస్పీ కూడా ఆ బైక్‌ను వెంటాడారు. సెంటర్‌లో ఆ సమయంలో రద్దీ ఎక్కువగా ఉండడంతో డీఎస్పీ వాహనం వెనుకబడింది. ఈ క్రమంలో బైక్‌తో మరింత స్పీడుగా ఆ ఇద్దరు చిన్నమ్మతల్లి ఆలయం వైపున్న పక్క రూట్‌లోకి వెళ్లారు. ఆ రూట్ ఎటు వెళ్తుందో తెలియక మళ్లీ మెయిన్ రూట్‌లోకి వచ్చారు. బొబ్బిలి వెళ్లే రహదారికి వచ్చి వేగవంతంగా వెళ్తూ ఎదురుగా వస్తున్న డీఎస్పీ వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో బైక్ కిందపడిపోయింది. అయితే వీరి వద్ద గంజాయి ఉండని తెలియక డీఎస్పీ వాహన చోదకులకు ఏమైందోనని ఆందోళన చెందారు. డీఎస్పీ తన వాహనం నుంచి దిగి వచ్చేలోపు వాహనదారులు వాహనాన్ని, వారితో ఉన్న రెండు బ్యాగులు, హెల్మెట్‌లు అక్కడే వదిలేసి పక్క పొలాల్లోకి పారిపోయారు. డీఎస్పీ వాహనం వెనుక వస్తున్న పోలీసులు వారి వెంట పడ్డారు. ఇంతలో చీకటి కావడంతో వారు రామభద్రపురం గ్రామంలోకి వెళ్లిపోయారు. పోలీసులు కనిమెరక వీధి, అగురు వీధి, గ్రామం పక్కనే ఉన్న పొలాల్లో గాలించారు. అయినా ఎక్కడా వారు కనిపించలేదు. పోలీసులు ప్రయత్నం ఫలించలేదు. ఈ క్రమంలో వాహనదారులు విడిచిపెట్టిన బైక్, రెండు బ్యాగులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బ్యాగులను పరిశీలించగా అందులో సుమారు 23 కిలోల గంజాయి ఉన్నట్టు పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. ద్విచక్ర వాహన నంబరును పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు విశాఖలో ద్విచక్ర వాహనాన్ని అద్దెకు తీసుకుని గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. కేసు నమోదు చేశారు.